ప్రజాశక్తి
మంగళవారం 17 అక్టోబర్ 2023 5
శ్రీ సత్యసాయి



రైల్వే బుకింగ్ కేంద్రంలో పనిచేయని సర్వర్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

స్థానిక ఆర్‌టిసి బస్టాండులో ఏర్పాటు చేసిన రైల్వే బుకింగ్ కేంద్రంలో పది రోజులుగా సర్వర్ మొరాయించు చడంతో ప్రయాణికులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దసరా శరన్నవరాత్రుల సమయం కావడంతో పుట్టపర్తికి వచ్చే భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు, దేశ, విదేశీ భక్తులు ఇక్కడ సేవలను సద్వినియోగం చేసుకుంటారు. ఈ క్రమంలో సర్వర్ మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా హైదరాబాద్ నుంచి సర్వర్ కార్యకలాపాలు జరుగుతుండడంతో ఈ సమస్య నెలకొందని బుకింగ్ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పేదల నిరసనాగ్రహం

- కలెక్టరేట్‌ను ముట్టడించిన చిలమత్తూరు, లేపాక్షి పేదలు, రైతులు
- ధర్నా వద్ద సిఐ ఓవరాక్షన్
- సిపిఎం నాయకులు, పేదలపై పరుషపదజాలం
- సిఐ తీరుపై ఆగ్రహం



కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పేదలు



డిఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇళ్ల పట్టాల కోసం చిలమత్తూరు పేదలు, భూ సమస్యల పరిష్కారం కోసం లేపాక్షి మండల రైతులు చేస్తున్న పోరాటాలు అలుపెరగకుండా కొనసాగుతున్నాయి. న్యాయమైన వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారు. ఇంతకాలం మండల కేంద్రంలో పోరాటం సాగించిన పేదలు సోమవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఉపక్రమించారు. పెద్ద సంఖ్యలో పేదలు పుట్టపర్తి కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. చిలమత్తూరు మండల కేంద్రంలో ఇళ్లు లేని నిరుపేదలు, లేపాక్షి మండలం కొర్లకుంట, కొండూరు గ్రామాలకు చెందిన దళితులు సాగుభూమి సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్‌ను కలిసేందుకు సిపిఎం ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సిఐ కొండారెడ్డి, పోలీసులు వారిని అడ్డుకున్నారు. తాము సమస్యను అధికారులకు తెలిపేందుకు వెళ్తున్నామని, తమను వెళ్లనివ్వాలని పేదలు కోరినా సిఐ వినలేదు. అధికారులను కలిసే అవకాశం ఇవ్వాలని కోరిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌ను సిఐ బలవంతంగా అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. దీంతో పేదలు, మహిళలు ఒక్కసారిగా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల జులుం నశించాలి.. సిఐ డౌన్ డౌన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం నాయకులు, పేదలపై పరుషపదజాలంతో దూషించడమే కాకుండా, విచక్షణ రహితంగా వ్యవహరించిన సిఐ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల నిరసన తీవ్రం కావడంతో సిఐ వారివద్దకొచ్చి క్షమాపణ చెప్పాడు. నిరసనకారుల వద్దకు డిఆర్‌ఓ కొండయ్యను తీసుకొచ్చారు. సమస్యను విన్న డిఆర్‌ఓ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల కోసం పేద వద్ద అర్జీలు తీసుకుంటామన్నారు. వీటిపై ఈ నెల 21న కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. డిఆర్‌ఓ హామీతో కలెక్టరేట్ వద్ద ధర్నాను విరమించారు. అంతకుమునుపు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, పెద్దన్న మాట్లాడుతూ చిలమత్తూరు గ్రామానికి చెందిన ఇళ్లు లేని 260 మంది నిరుపేదలను గుర్తించి పట్టాలను ఇచ్చినట్లే ఇచ్చి అధికారులు వెనక్కి తీసుకున్నారన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఎక్కడా స్థలాలు చూపలేదన్నారు. ఇంకా 300 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 90 రోజుల్లో ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పిన అధికారులు 6 నెలలు అయినా పట్టించుకోలేదన్నారు. పేదలు గత రెండు నెలల నుంచి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నారు. తహశీల్దారు ఉన్నఫలంగా గుడిసెలను తొలగించి గుడిసెలలో ఉన్న విలువైన వస్తువులను నిప్పు పెట్టి కాల్చి వేయించారన్నారు. కొర్లకుంట, కొండూరు గ్రామాల దళితులకు చెందిన సాగుభూములను లవకుశ అనే ప్రయివేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని నమ్మించి భూములు లాక్కున్న ప్రభుత్వం 6ఏళ్లు అయినా పరిశ్రమలు నెలకొల్పలేదన్నారు. అన్యాక్రాంతమైన భూముల కోసం న్యాయంగా పోరాడుతున్న ఇద్దరు దళితులు కూడా అనుమానాస్పద రీతిలో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను స్పందించ కలెక్టర్‌కు చెప్పుకుందామని వస్తే పోలీసులు లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. పోలీసులు పేదలను అడ్డుకోవడం మానేసి, సమస్య పరిష్కారానికి చొరవ చూపితే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, లవకుశ భూ సాధన పోరాట సంఘం నాయకులు గోపాలకృష్ణ, పేదలు పాల్గొన్నారు.

మైనర్ విద్యార్థినిపై అకృత్యం

- గర్భవతిని చేసిన ఉపాధ్యాయుడు
- మగ శిశువుకు జననం
- 'అనంత' ఆసుపత్రిలో చికిత్స
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, తనకల్లు

మాయ మాటలతో మైనర్ బాలికను ఉపాధ్యాయుడు లొంగదీసుకుని, లైంగిక దాడికి పాల్పడిన ఘటన సత్యసాయి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక ప్రసవం కూడా అయ్యి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో విషయం రెండు రోజుల తరువాత బయటకొచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కదిరి డీఎస్పీ శ్రీలత విలేకరులకు వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు... సత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని పరకవాండ్లపల్లికి చెందిన బాలిక మండలం కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ బాలిక గతేడాదిలో పదవ తరగతిని తనకల్లులోని జడ్పీహెచ్ స్కూల్‌లో చదివింది. ఈ సమయంలో అక్కడ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తి మాయమాటలతో లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆమె గర్భం దాల్చింది. విషయం బయటకు తెలియక పోవడంతో బాలిక ఈ ఏడాది ఆగస్టులో జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరింది. మొదటి పది రోజులు కళాశాలకు వెళ్లి అనంతరం వెళ్లలేదు. ఆ తరువాత ఇటీవల జరిగిన క్వార్టర్లీ పరీక్షలకు హాజరైంది. గత శనివారం నాడు కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బాలికను చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆమె గర్భం దాల్చినట్టుగా నిర్ధారించారు. కడుపునొప్పి కాదని, ప్రసవ నొప్పులని గుర్తించి వైద్యం అందించారు. అక్కడే బాలిక మగశిశువుకు జన్మనిచ్చింది. రక్త హీనతతో బాధపడుతుండటంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు బాలికను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. అక్కడ బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. ఆదివారం నాడు అనంతపురం ఆసుపత్రికి వచ్చారు. ఈ నేపథ్యంలో బాలికకు ప్రసవం అయిన సమాచారం పోలీసులకు తెలియడంతో కదిరి డీఎస్పీ శ్రీలత సోమవారం ఉదయం అనంతపురం సర్వజన ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఉపాధ్యాయుడే కారణమని బాధితురాలు చెప్పినట్టు శ్రీలత మీడియా తెలిపారు. దీంతో సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఆమె మీడియాకు వివరించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జగనన్న లే అవుట్లలో గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ స్పందన కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలను సమీక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు కచ్చితంగా పాల్గొనాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. డిసెంబర్ నాటికి జిల్లాలో 22 వేల సామూహిక గహప్రవేశాలు పూర్తి చేయించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష, హౌసింగ్, ఈ క్రాప్ బుకింగ్, నాడు నేడు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షించారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకై అధికారులు అందరూ ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. గహ నిర్మాణ లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసే విధంగా డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ప్రత్యేక అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, జగనన్న లే అవుట్‌లలో మౌలిక సదుపాయాల విషయమై కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి ఫలితాలు సాధించాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ సచివాలయాల ఇంజినీర్లు ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో అధికారుల పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వైద్య సిబ్బంది, మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. వైద్య శిబిరాల్లో ఓపి సంఖ్య ఎక్కువగా నమోదు అవుతోందని, అందుకు సరిపడా మందులు ఏర్పాటు చేసుకుని వైద్యులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, మెప్మా అధికారి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, జిల్లా వైద్యాధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సకాలంలో స్పందించండి ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే వివిధ ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా' పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 40 అర్జీలను స్వీకరించారు. స్పందనలో వచ్చే పిటీషన్లపై, పోలీసు అధికారులు సకాలంలో స్పందించి, అర్జీలు విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, దిశా డీఎస్పీ కెవిఎన్ వరప్రసాద్ లీగల్ సెల్ అడ్వయిజర్ సాయినాథ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-ముదిగుబ్బ



వెంగమేష్ చౌదరి

మానవహక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నమని జాతీయ మానవ హక్కుల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంగమేష్ చౌదరి పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల జాతీయ అధ్యక్షులు డిఆర్.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ముదిగుబ్బ మండల కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. హ్యూమన్ రైట్స్ జాతీయస్థాయిలో విస్తతంగా పనిచేస్తోందన్నారు. హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ కమిటీ అక్కడకి వెళ్లి బాధితుల పక్షాన నిలుస్తోందన్నారు. గ్రామస్థాయిలో ఎక్కడైనా హక్కులకు భంగం వాటిల్లితే తమ దృష్టికి తెస్తే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గొర్రెల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి-పరిగి

యాజమాన్య పద్ధతులు పాటించి లాభదాయకమైన గొర్రెల పెంపకం చేపట్టాలని ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ రెడ్డి, హిందూపురం డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ పెంచలయ్య తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు సమావేశ భవనంలో పరిగి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సోమనాథ్ ఆధ్వర్యంలో సోమవారం గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల పెంపకం చేపట్టే రైతులు లాభదాయకమైన గొర్రెల పెంపకం చేపట్టాలన్నారు. మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేళ్లు ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించామన్నారు. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించడం ద్వారా గొర్రెల మరణాల శాతం తగ్గించవచ్చని సూచించారు. గొర్రెల్లో పారుడు వ్యాధి, గాలికుంటు వ్యాధి, చిటుక రోగం, బొబ్బవ్యాధి, నీళ్ల నాలుక, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నట్టల నివారణ, పిరుదులు తదితర వ్యాధులు సక్రమిస్తాయన్నారు. వీటి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ జానకి, చైతన్యకుమార్, దీపిక రాధిక, నీరజ, ప్యాపిలి గొర్రెల పెంపకం దారుల శిక్షణ కేంద్రం పశువైద్యాధికారి జానకి, ఖలందర్, నరసింహమూర్తి, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఘనంగా నాగదేవతల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-హిందూపురం



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న దీపిక వేణురెడ్డి

హిందూపురం రూరల్ మండలం గోళాపురం శివాలయంలో నాగదేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లపురం గ్రామానికి చెందిన కెఎన్.రామకష్ణప్ప కుటుంబ సభ్యులు, బసవరాజ్, తూముకుంట చెక్ పోస్ట్ మహేష్‌తో పాటు గ్రామస్తులు ఇతర దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దేవరాజ్, ఎంపీటీసీ రామంజి, మలుగురు సర్పంచి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, రంగధామప్ప, సంజీవరెడ్డి, వైసీపీ నాయకుడు తిప్పేరుద్రయ్య, రంగనాథ్ పాల్గొన్నారు.

ఉత్పత్తి ఉన్నా.. ఎగుమతి లేదు..



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

అధికారుల ఎదుట చేనేత కార్మికుల ఆవేదన

ప్రజాశక్తి-సోమందేపల్లి

'రాత్రింబవళ్లు ఎంతో కష్టపడి చీరలను తయారు చేస్తున్నాం.. పెద్ద ఎత్తున ఉత్పత్తి ఉంది.. అయితే ఎగుమతి లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం'.. అని చేనేత కార్మికులు అధికారుల ఎదుట వాపోయారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం నాడు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ సంబంధించి చేనేత అధికారులు చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఏడీ రమేష్, అనంతపురం జిల్లా ఏడీ అప్పాజీ, చేనేత డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణారెడ్డి, జిల్లా చేనేత అధికారి బసవరాజు ఏడిఒ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న చేనేత కార్మికులు పలు సమస్యలను అధికారులు దష్టికి తీసుకువెళ్లారు. మండల చేనేత కార్మిక సంఘం కార్యదర్శి శీలా నారాయణస్వామి మాట్లాడుతూ చేనేత పరిశ్రమ రోజురోజుకి దిగజారి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాల్లో ముద్ర రుణాలు బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల సరిగా అందటం లేదన్నారు. 50 సంవత్సరాల దాటిన చేనేత కార్మికులకు ప్రభుత్వం పింఛన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. చేనేత కార్మికుల ప్రోత్సాహం కోసం చేనేత ముడిసరుకులను 90 శాతం సబ్సిడీతో అందించి, ప్రభుత్వమే పట్టు చీరలు కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు చేనేత కార్మికులు మాట్లాడుతూ గతంలో మండలంలో పదివేల మంది చేనేత కార్మికులు ఉండేవారన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవించేవారమన్నారు. రానురాను ఈ వృత్తిలో ఆదాయం లేక కార్మికులు ఇతర వృత్తుల్లోకి వెళ్తున్నారన్నారు. అప్పులభారంతో చాలా మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి చేనేత కార్మికులను ఆదుకునే చర్యలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు అశ్వర్థ, బుసయ్యగారి పల్లి అంజి, హరి, వెంకటేష్, రమణమ్మ, లక్ష్మీదేవి, కార్మికులు పాల్గొన్నారు.

'ఆద్య' కోసం కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గత గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో శరణ్య శ్రీరాజ్ కుమార్తె చిన్నారి ఆద్య మృతి చెందింది. సోమవారం సాయంత్రం ప్రజా సంఘాలు, రెడ్డి జెఏసితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అన్ని వర్గాల వ్యాపారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు చిన్నారి ఆద్య కోసం కొవ్వత్తుల ర్యాలీ చేపట్టారు. చిన్నమార్కెట్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది యువకులు ర్యాష్ డ్రైవింగ్ వల్లే రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కోరారు. ఈ శాంతి ర్యాలీలో వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ బైసాని రాంప్రసాద్, లైఫ్ వరల్డ్ ఛారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్, ఎస్‌డిజి ఎస్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు మురళి దేశాయ్, ఉమర్ ఫరూఖ్ ఖాన్, శ్రీరాములు, లతీఫ్, నాగార్జున, సప్తగిరి ఈశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి ఆనంద్ రాజు. ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, మార్వాడి అసోసియేషన్ నాయకులు బాబు లాల్, ప్రవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, రీయాజ్‌తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే పోరాటం : వ్యకాసం

ప్రజాశక్తి-రొద్దం



వ్యవసాయ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పేద రైతులు

రైతులకు అన్యాయం చేసేలా అధికారులు నిర్ణయాలు తీసుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. ఐతులు సాగు చేసిన పంటలకు పంట నమోదు చేయాలని, టింబక్ట్ సంస్థపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం నాడు మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సాగుదారులందరూ ర్యాలీగా వెళ్లి రైతుల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన టింబక్ట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పేదల సాగుచేసిన పంటలను నష్టపరిచిన టింబక్ట ప్రతినిధులను అరెస్టు చేయాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ మండల పరిధిలోని కోగిర, శాపురం, కంబాలపల్లి, గ్రామాలకు చెందిన భూమి లేని నిరుపేదలు 200 మంది కోగిర రెవెన్యూ పొలం సర్వే నంబర్ 669లో ఉలవలు, కందుల పంటలను సాగు చేశారన్నారు. వ్యవసాయ అధికారులు వీటికి పంట నమోదు చేయాలన్నారు. కోగిర, శాపురం, కంబాలపల్లి గ్రామాల రైతులు దశాబ్దల తరబడి ప్రభుత్వ భూముల సాగు చేసుకుని కుటుంబాలను పోషించు కుంటున్నారని తెలిపారు. వారిసాగులో ఉన్న భూములను లాక్కోవాలని చూడడం దుర్మార్గం అన్నారు. ప్రస్తుత భూ పంపిణీలో అసైన్మెంట్‌లో అర్హులైన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు వందమంది రైతులు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కిట్‌ను అందిస్తున్న ఇంచార్జ్ దీపిక వేణు రెడ్డి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ధ్యేయం వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి

హిందూపురం : ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్యం ఉచితంగా అందించి....ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వైసిపి ఇన్‌ఛార్జ్ దీపిక వేణురెడ్డి తెలిపారు. సోమవారం రూరల్ మండలం బీరేపల్లి గ్రామంలోని పాఠశాల ఆవరణంలో సర్పంచి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఒఆర్‌డి నటరాజ్, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ సంతెబిదునురు రాము, సర్పంచులు రమేష్, అశ్వర్థ నారాయణరెడ్డి, వైస్ సర్పంచి సరోజమ్మ, జెసిఎస్ కన్వీనర్ గిరి, నాయకులు రాచపల్లి మహేంద్ర నాథ్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, రామకష్ణ, శ్రీనాథ్ రెడ్డి, గోవిందరెడ్డి, నరేంద్ర రెడ్డి, రాజా రెడ్డి, అప్పిరెడ్డి, రమేష్, రవీంద్ర రెడ్డి, చౌడమ్మ, వెంకట లక్ష్మమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సిఎం జగన్ కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కదిరి బ్రాహ్మణపల్లి నుంచి ఎగువపల్లికి రూ. 173 లక్షల వ్యయంతో నూతనం గా నిర్మించిన తారు రోడ్డును సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సిఎం జగన్ సహకారంతో నియోజకవర్గంలో దాదాపు 135 గ్రామాలకు నాణ్యమైన రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. మారుమూల గ్రామాలకు సైతం అప్రోచ్ రోడ్లు వేయించి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 108, 104 వాహనాలను అందుబాటు లోకి తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షాలు అధికార దాహంతో సిఎం జగన్‌పై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని, ప్రజలు వీటిని నమ్మే పరిస్థితులు లేవని, మళ్లీ అభివృద్ధికే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అమర్‌నాథ్‌రెడ్డి, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

రేషన్ బియ్యం స్వాహా

ఆఫ్‌లైన్‌ను అవకాశంగా మలుచుకున్న డీలర్లు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

ప్రజాపంపిణీ ఆన్‌లైన్ వ్యవస్థకు సంబంధించి సర్వర్ సమస్య తలెత్తడంతో ఆఫ్‌లైన్‌లోనే లబ్ధిదారులకు బియ్యం ఇవ్వాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టణంలోని కొందరు డీలర్లు తమకు అవకాశంగా మలుచుకుని కార్డుదారులకు తెలియకుండానే వారి బియ్యం స్వాహా చేశారు. అమరావతిలో ప్రజాపంపిణీ ఆన్‌లైన్ వ్యవస్థకు సంబంధించి సర్వర్ సమస్య తలెత్తింది. దీన్ని సరి చేయడానికి సమయం పట్టడంతో కార్డుదారులు ఇబ్బందులు పడతారన్న ఉద్దేశంతో ఉన్నతాధికారులు ఆయా డీలర్ల వద్ద ఉన్న యంత్రంలో విఆర్ఒ బయోమెట్రిక్ లాగిన్ చేసి లబ్ధిదారుల కార్డు చూసి నేరుగా(లబ్ధిదారుని వేలి ముద్ర వేయకుండా)బియ్యం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. కేవలం ఆయా డీలర్ల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు మాత్రమే బియ్యం ఇచ్చేలా ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఆఫ్‌లైన్‌లోనే లబ్ధిదారులకు బియ్యం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. ఇదే అదునుగా భావించిన చౌకధాన్యం డీలర్లు తమ తెలివి తేటలకు పదును పెట్టి లబ్ధిదారులు రాకనే వారి కార్డు నెంబర్ నమోదు చేసి బియ్యం స్వాహా చేశారు. ఆదే తన పరిధిలో లేని కార్డుదారులకు సంబంధించిన బియ్యం సైతం కాజేశారు. కొందరు డీలర్లు ప్రధానంగా అంత్యోదయ కార్డుదారులకు ఇచ్చే 35 కిలోల బియ్యం కాజేశారు. పాత్రికేయుడు అంత్యోదయ కార్డు వైఎపి 12480050013కు వచ్చే 35 కిలోల బియ్యం కాజేశారు. అదీ ఈ కార్డు పరిధి డీలర్ కాకుండా. చౌకధాన్యం(1248002)దుకాణం-2(వాణి సుధాకర్)లో ఈ కార్డుకు సంబంధించిన బియ్యం ఈ నెల 13వ 12.29 గంటలకు తీసుకున్నటుగా స్లిప్ పరిశీలిస్తే తెలుస్తోంది. ఇలా ఇతర కార్డుదారుల బియ్యాన్ని సైతం మరికొందరు డీలర్లు కాజేసినట్లు సమాచారం.

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి పాలనకు చరమగీతం పాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం పార్థసారథి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గోనిపేట గ్రామంలో చేపట్టిన 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో పార్థసారథి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ. 7 కోట్ల వ్యయంతో గోనిపేట వంతెన, గ్రామంలో సీసీ రోడ్లు, తాగు నీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. గోని పేట, తండా లో దాదాపు రూ. 13 కోట్ల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, జిల్లా యాదవ సాధికార కన్వీనర్ కేశవయ్య, నాయకులు



'బాబుతో నేను' కార్యక్రమంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

కురుబ కృష్ణమూర్తి, రామలింగ, నాగమణి, చంద్రకాంతమ్మ, గాయత్రి, సిద్దయ్య, సిద్దలింగప్ప, రవిశంకర్, నాగరాజు, శ్రీనివాసులు, హుజూర్, సుబ్బరాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులు,జావిద్, షౌకత్, హనుమంత నాయక్, బాబుల్ రెడ్డి, బోయ అనిల్ కుమార్, రాజు, ప్రసాద్, హరి, అంజనప్ప, రమేష్, సుధాకర్, రామాంజనేయులు, నాగేంద్ర, బాలునాయక్, మోహన్ నాయక్, వెంకటేష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రైతు దగా ప్రభుత్వం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

వేరుశనగ పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 40 వేల చొప్పున పరిహారం అందించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధి లోని కోడిగానపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతులు నాగప్ప, లింగమ్మ సాగు చేసిన వేరుశనగ పంటను ఆయన సోమవారం పరిశీలించారు. అలాగే రైతు నాగన్న వద్దకు వెళ్లి పంట దిగుబడి గురించి ఆరా తీశారు. తిప్పేస్వామి మాట్లాడుతూ వర్షాలు లేక వేరుశనగ పంట ఎండిపోయి రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి లేదన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లు, రెయిన్ గన్‌లు అందించి రైతులను ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీకి ఓ రైతు భరోసా



ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి, తదితరులు

కేంద్రం ఏర్పాటు చేసింది కానీ రైతులను ఆదుకోవడం లేదన్నారు. అనంతరం టమోటా, బంతి పూల సాగును పరిశీలించారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, రవీంద్రారెడ్డి, నారాయణగౌడ, హను మంతగౌడ, కరియన్న, కృష్ణమూర్తి, శ్రీరామప్ప, డాబా రంగనాథ్, డి.పాండురంగప్ప, రవికుమార్, నాగేంద్ర, రంగధామప్ప, రమేష్, గోవిందప్ప, రామచంద్రప్ప, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, నాగరాజు ఉన్నారు.

కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇటీవల గుంటూరులో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. కట, కుమిటే విభాగాల్లో 19 బంగారు, 2 సిల్వర్ పతకాలు సాధించారన్నారు. కట విభాగంలో కైఫ్, రీదా ముస్కాన్, ఫహీం, కీర్తి, వైష్ణవి, లవన్ కుమార్, జాయేద్, దైవిక్, సాయి బంగారు పతకాలు, జోయ, ఫాతిమా సిల్వర్ మెడల్స్ సాధించారు. కుమిటే విభాగంలో కైఫ్, రీదా ముస్కాన్, ఫహీం, గీత, రోషిని, వైష్ణవి, లవన్‌కుమార్, జాయేద్, దైవిక్, సాయి బంగారు పతకాలు, కీర్తి సిల్వర్ పతకం సాధించించారు. అనంతరం మాస్టర్ షాకిర్‌ని శాలువా, మెమెంటోతో సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

కొత్తచెరువు : మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పివి చౌదరి కుమారుడు డాక్టర్ పివి రామ్‌ప్రసాద్ సహకారంతో సోమవారం సర్పంచి రాధానాగరాజు దుస్తులు పంపిణీ చేశారు. డాక్టర్ రామ్‌ప్రసాద్ జన్మదినం సందర్భంగా సొంత గ్రామంలో పారిశుధ్య కార్మికులకు కొత్త దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ సాలమ్మగారి శివ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్ల లైసెన్స్ రద్దుచేయాలి

ధర్మవరం టౌన్ : పట్టణంలో అధిక ధరకు ఈ స్టాంపులు విక్రయిస్తున్న స్టాంప్ వెండర్ల లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు ఆర్‌డిఒ కార్యాలయ అధికారిణి కుఫ్రాకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాది ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని స్టాంప్ వెండర్లు సిండికేట్‌గా ఏర్పడి ఈ స్టాంపులను అధిక ధరకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతు న్నారన్నారు. ప్రశ్నిస్తే స్టాంపులు ఇవ్వడం లేదని, అధికారులు వీటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బత్తలపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపసర్పంచి కోటి గోపీనాథ్ ప్రజలకు సూచించారు. గోపీనాథ్ ఆధ్వర్యంలో సోమవారం బత్తలపల్లిలో పంచాయతీ కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. అందులో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, ఎమ్మార్సీ కార్యాలయం చుట్టూ అపరిశుభ్రత నెలకొని ఉండడంతో కార్మికుల చేత శుభ్రం చేయించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్యం పడకేసిందని, దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతూ సోమవారం మానవ హక్కుల సంఘం నాయకులు ఎంవి పాపన్న, సాయి, ఓబులేసు ఎంపిడిఒ బరాన్‌సాబ్‌కి వినత పత్రం అందజేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో వారు సమస్యలను అధికారలు దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీకి ఆదాయం ఉన్నా పారిశుధ్య కార్మికులను తగ్గించడంతో పారిశుధ్యం పడకేసిందన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఐమాక్స్ లైట్లు, గ్రామంలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రివేళ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్ల పైన పేరుకుపోయిన మట్టిని తొలగించాలని వారు కోరారు. సచివాలయం వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్స్ షాపింగ్‌ను గదులుగా మార్చాలని సూచించారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-బత్తలపల్లి



బాల్య వివాహాలపై మాట్లాడుతున్న ఎపిఎం సుదర్శన్‌రాజు

బాల్య వివాహాలను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడంలో స్వయం సహాయక సంఘాలు, సభ్యుల పాత్ర కీలకమని పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. స్థానిక భారతి మండల సమాఖ్య భవన్‌లో సోమవారం బాల్య వివాహాల నియంత్రణపై రాష్ట్ర అధికారులు ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సిఎస్ రాజశేఖర్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యనిర్వహణ అధికారి ఎండి ఇంతియాజ్ ఆన్‌లైన్ ద్వారా మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించి 'బాల్య వివాహల నియంత్రణపై ప్రమాణం' చేయించారు. ఎపిఎం సుదర్శన్‌రాజు బాల్య వివాహ నిషేధ చట్టం-2006 గురించి వివరించారు. రక్త హీనత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, విద్య, తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ లీడర్లు, సీసీలు సుధాకర్, వెంకటసత్యం, శంకర్, నాగానంద్, లక్ష్మీనారాయణ, అకౌంటెంట్ గోవిందమ్మ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

ప్రజాశక్తి-రొద్దం



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపి మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ

పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' లక్ష్యమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొ న్నారు. ఆయన తొలుత ఎంపి గోరంట్ల మాధవ్‌తో కలిసి మండల పరిధిలోని చిన్నగువ్వలపల్లిలో ఎంపి నిధులతో రొద్దం-హిందూ పురం రహదారి నుంచి గ్రామంలోకి నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. తర్వాత వారు పెద్దగువ్వలపల్లి జడ్పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సెల్వియా సల్మాన్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్‌విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, ఇఒఆర్‌డి కేశవరెడ్డి, డాక్టర్ జగదీశ్, త్రిలోకనాథ్, ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచి పి.రూప, స్వచ్ఛాంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు రక్ష : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

కదిరి అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు రక్ష అని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎగువపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్ సర్కార్ అన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారికి ఎమ్మెల్యే కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అమర్‌నాథ్‌రెడ్డి, వైసిపి ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల పరిధిలోని గుడ్డంపల్లితండాలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, ఎంఇఒ రమణప్ప, డాక్టర్లు రాజేంద్ర, నాగేంద్రనాయక్, సర్పంచి పథ్వీనాయక్, గుంజేపల్లి సర్పంచి సంధ్యలక్ష్మి, చిన్నతిరుపాల్‌నాయక్, నాగేంద్రనాయక్, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపిడిఒ బరాన్‌సాబ్, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి సూచించారు. మండల పరిధిలోని తలమర్ల గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి రత్న మ్మ, డాక్టర్ శివరాం, సునీల్, మమత, శ్యాంసుందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులపై ప్రభుత్వాల నిరంకుశ వైఖరి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిరంకుశ వైఖరిని వీడాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు అశోక్ పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టగా రాష్ట్ర అధ్యక్షులుతో పాటు జిల్లా కార్యదర్శి గిరీష్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు రంగనాయకులు, జిల్లా నాయకులు జయవర్ధన్, రామచంద్రప్ప, శివప్ప, కదిరప్ప పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 12 నెలల నుంచి వేతనాలు అందక కుటుంబాల పోషణ భారమైందన్నారు. రైతులు, కార్మికులు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా నాయకులు అంజయ్య, ముండ్లప్ప, పారిశుధ్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'జగనన్న లే అవుట్'కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-చిలమత్తూరు



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నెల రోజుల నుంచి ఇంటి స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో పేదలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు సోమవారం రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు కోడూరు రెవెన్యూ పొలం సర్వే నెంబర్-353లో 4 ఎకరాల భూమిని పరిశీలించారు. తహశీల్దార్ నాగరాజు, మండల సర్వేయర్ సురేష్, విఆర్ఒ రాజేష్, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, సర్పంచి మురళీ స్థలాన్ని పరిశీలించి 'జగనన్న లేఅవుట్'కు అనువుగా ఉంటుందని తెలిపారు. కనీస మౌలిక వసతుల కల్పనకు ఎంపిపి నిధులు, పంచాయతీ నిధులు ఉపయోగించి వెంటనే ఇంటి స్థలాలు ఏర్పాటు చేసి పట్టాలు పంపిణీ చేయాలని ప్రజాప్రతినిధులు తెలిపారు. అనంతరం ఇంటి స్థలాల సాధన కమిటీ సభ్యులకు ఆ స్థలాన్ని చూపారు. కమిటీ సభ్యులతో చర్చించి నివాసయోగ్యమైన ప్రదేశమా కాదా అని నిర్ధారిస్తామన్నారు.

'ఎపికి జగనే ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-ముదిగుబ్బ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక షాదీమహల్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఇంటిం టికీ వెళ్లి టిడిపి పాలనకు జగన్ పాలనకు తేడాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సివి.నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరు మల సేవేనాయక్, భాస్కర్, సర్పంచి లక్ష్మీదేవి చెన్రాయుడు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం రజక సంఘం ఆధ్వర్యంలో ధోబి ఘాట్ కోసం, రజకుల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా కార్యదర్శి లింగార్జున, రజకులు పాల్గొన్నారు.

ఎంసెట్ మూడో విడత కౌన్సిలింగ్ నిర్వహించాలి

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎంసెట్ మూడో విడత కౌన్సిలింగ్ తక్షణమే నిర్వహించాలని కోరుతూ సోమవారం టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఏటా మూడు విడతలుగా ఎంసెట్ కౌన్సిలింగ్ నిర్వహించే వారని, ఈ ఏడాది రెండు విడతలే కౌన్సిలింగ్ నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటో ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్పాట్ అడ్మిషన్లు అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సిన పని లేదని, కౌన్సిలింగ్ సీట్లు అయితే చెల్లించాల్సి వస్తుందనే కుతంత్రంతో మూడో విడత కౌన్సిలింగ్ రద్దు చేయడం అన్యాయమన్నారు. వినతి ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు కురుబ జగదీష్, రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్ర, వెంకటాపురం అబ్బి, అధికార ప్రతినిధి గణేష్ చౌదరి, నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసులు, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షులు భార్గవ్‌గౌడ్, బాలకృష్ణ, సాయి, రాజేష్, ఉపేంద్ర, మారుతి, వెంకటేష్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల పెంపుపై ధర్నా

ప్రజాశక్తి-బత్తలపల్లి

విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ సోమవారం సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేశ్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు వినియోగదారులపై మోయలేని భారాలు విధిస్తున్నా రని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ సమస్యలను కట్టడి చేసి వినియోగదారులపై భారం లేకుండా చూడాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇ శివయ్య అందుబాటులో లేకపోవడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సిపిఐ నాయకులు గోగుల వెంకటేష్, రామాంజనేయులు, కుళ్లాయప్ప, ముత్యాలు, వెంకటేష్, మహిళలు, వినియోగదారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లిలో శ్మశాన వాటిక కబ్జా కాకుండా చూడాలని సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ వల్ల చనిపోయిన వారిని పూడ్చడానికి స్థలం కొరత ఏర్పడిందని, వెంటనే ప్రభుత్వం భూమిని గుర్తించి హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిరుపాలు, ఓబులేసు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పైపు లీకేజీతో ఇళ్లకు బీటలు

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కొడకార్లగుట్ట కాలనీలో సోమవారం గ్యాస్ పైపు లీకేజీ కారణంగా ఐదు ఇళ్ల గోడలు బీటలు వారాయని ఆయా ఇళ్ల యజమానులు వాపోతున్నారు. వివరాలు.. కర్నాటక ప్రాంతం నుంచి ఆంధ్ర మీదుగా తెలంగాణకు గ్యాస్ సరఫరా చేసేందుకు పైపులైన్ పనులు చేపట్టారు. అయితే వివిధ కారణాలతో ఆ పనులు నిలిచిపోయాయి. ఇటీవల ఆ పైపులైన్ నుంచి గ్యాస్ లీకేజీ అవుతుండడంతో ఇళ్ల గోడలు నెర్రెలు చీలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు చోటా మోటా నాయకులు గ్యాస్ పైపులైన్ చేస్తున్న వారితో డబ్బులు తీసుకుని ఈ విషయాన్ని అణచివేస్తున్నట్లు సమాచారం. పైపులైన్ మరమ్మతులు చేసే సమయంలో ఇళ్లకు జరిగిన ప్రమాదానికి బాధ్యులెవరని మండిపడుతున్నారు.

రాఘవంపల్లిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా సాగుచేసిన వేరుశనగ పంటలో దిగుబడి అంచనా కోసం నిర్వహిస్తున్న పంటకోత ప్రయోగాల్లో దిగుబడి కనిపించ లేదు. మండల పరిధిలోని రాఘవంపల్లిలో సోమవారం ఎఒ ఓబిరెడ్డి, మండల గణాంక అధికారి డాక్టర్ కెఎల్ లక్ష్మీనరసింహశర్మ, విహెచ్ఎ సత్యనారాయణ, తదితరులు రైతు నాగలక్ష్మి పొలంలో వేరుశనగ పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. కేవలం 0.920 గ్రాముల దిగుబడి వచ్చినట్లు అధికారులు గుర్తించారు.

ఘనంగా లక్ష్మీవెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన

పరిగి : మండల పరిధిలోని కొడిగెనహళ్లి అగ్రిగోల్డ్ లేఔట్‌లో సోమవారం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. ఉదయం ప్రాణ ప్రతిష్టాపన, మూల విగ్రహాలకు విశేష అలంకరణ కార్యక్రమాలు నిర్వహించగా ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెటి శ్రీధర్ పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ. ఒక లక్ష ఒక రూపాయి విరాళం అందజేశారు.

తొలగించిన ఓటరు జాబితా ఇవ్వండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 40వ వార్డుల్లో తొలగించిన ఓటరు జాబితా, సమాచారం ఇవ్వాలని కోరుతూ సోమవారం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ కుఫ్రాకు వినతిపత్రం అందజేశారు. క్రిష్ణ, నారాయణస్వామియాదవ్, గంధమనేని నారాయణస్వామి, శ్రీనివాసులు, నబిరసూల్, దస్తగిరి, నిరంజన్ యాదవ్, తదితరులు తొలగించిన ఓటరు జాబితా పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా 100 వార్డులకు సంబంధించిన పోస్టుకార్డులను పోస్టాఫీసులో పోస్టు చేశారు.

అనాథాశ్రమంలో అన్నదానం

రొద్దం : మండల పరిధిలోని బొక్సాంపల్లి గ్రామానికి చెందిన రాజు కుమారుడు భానుతేజ(4) వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కుమారుడి జ్ఞాపకార్థం రాజు సోమవారం హిందూపురం మండల పరిధిలోని కొట్నూరు గ్రామంలో ఉన్న అనాథాశ్రమంలో 50 మందికి అన్నదానం ఏర్పాటు చేశాడు.



అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న రాజు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వాలంటీర్ మృతి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

విద్యుదాఘాతంతో వాలంటీర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని జొన్నల కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆవులకు పాలు పితకడం కోసం పశువుల పాకలోకి వెళ్లిన మధుసూదన్ (33) విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మధుసూదన్ వ్యవసాయంతో పాటు వాలంటీర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటి పక్కనే రేకుల షెడ్డు నిర్మించుకొని రెండు ఆవులు మేపుతున్నాడు. ఉదయం 6 గంటలకే ఆవుకు పాలు పితుకుతుండగా ఇనుప పోల్ తగలడంతో స్విచ్ బోర్డు నుంచి ఫ్యాన్‌కు కనెక్షన్ ఇచ్చిన వైర్లు ఇనుప పోల్‌కు తగిలి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ వంశీకృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండల పరిధిలోని హొట్టేబెట్ట గ్రామానికి చెందిన హరిజన గోలి నరసయ్య(75) సోమవారం గ్రామంలోని జాతీయ రహదారిపై నడుచుకొంటూ పొలానికి వెళ్తుండగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీ పంలో మడకశిర వైపు వెళ్తున్న బొలెరో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విఆర్ఒ వైకుంఠప్ప తహ శీల్దార్ హసీనా సుల్తానాకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి భార్య నాగలక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు.

చెరువులో పడి మహిళ...

అమరాపురం : మండల పరిధిలోని హేమావతి గ్రామంలో దళిత మహిళ రుద్రమ్మ(30) దుస్తులు ఉతకడానికి వెళ్లి పక్షవాతం రావడంతో నీళ్లలో జారి పడి మృతి చెందింది. ఆమెది పుట్టినిల్లు హేమావతి గ్రామం కాగా కర్నాటకలోని పావగడ సికె పురకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. తల్లి సంజీవమ్మ, భర్త ఎంజీరప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వాసు పత్రికి తరలించారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

కదిరి : పట్టణంలోని సహమేరా వీధికి చెందిన షేక్ ముబారక్, వయాన్ మోదిన్ ఖాన్ స్థానిక రాయచోటి రోడ్డు లోని ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తుండగా అరెస్టు చేసి వారి నుంచి రూ. 50,200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సిఐ మాట్లాడుతూ కదిరి పట్టణంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఇకపై మట్కా కార్యకలా పాలు నిర్వహిస్తే వారిపై నిఘా ఉంచి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని అమృతవల్లి డిగ్రీ కాలేజీ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. సిఐ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాత్రి 10:30 గంటల సమయములో రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారన్నారు. అందుకు సంబంధించి పట్టణంలోని కస్తూరిబాయి వీధికి చెందిన దిలీప్ కుమార్ ఫిర్యాదు మేరకు తిమ్మరాజు, జెట్టి ఆంజనేయులు, ఉదయ్, భరతకుమార్, గణేష్, కార్తీక్‌తో పాటు 20 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అదే ఘటనలో పవన్ కళ్యాణ్ ఫిర్యాదు మేరకు సింగం చంద్రశేఖర్, తోట వీర, వెంకటేష్, బాలు, జస్వంత్, పవన్, గంగాధర్, అశోక్ మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు.

సెబ్ అధికారుల దాడుల్లో పలువురి అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సెబ్ అధికారులు సోమవారం దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పుట్టపర్తి సెబ్ స్టేషన్ పరిధిలోని కర్నాటక నాగేపల్లి క్రాస్ సమీపంలో ఒకరిని, మడకశిర స్టేషన్ పరిధిలోకి కెఎన్.పల్లి గ్రామం, గుడిబండ మండలంలో ఒకరిని, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ పుట్టపర్తి, శాసనకోట, పరిగి మండలంలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరం స్టేషన్ సెబ్ సిబ్బంది నాటుసారా తయారీదారులపై నిఘా వేసి ఓబుళనాయనపల్లి తండా, ధర్మవరం మండల పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితులను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రిమాండ్‌కు తరలించారు.

పారిపోయిన యువకుడినితల్లికి అప్పగింత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

తల్లి మందలించిందని ఇంటి నుంచి పారిపోయిన ఓ యువకుడుని సోమవారం రైల్వే జిఆర్‌పి ఎస్ఐ గోపీకుమార్, హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖానందరెడ్డి అతడి తల్లికి అప్పగించారు. ఎస్ఐ మాట్లాడుతూ అనంత పురం నగరానికి చెందిన నూతనకుమార్ ఆదివారం రూ. 16వేలు వెచ్చించి మొబైల్ ఫోన్ కొనుగోలు చేయగా తల్లి సునీత మందలించింది. దీంతో అతడు అనంతపురం నుంచి రైలులో గుంతకల్లు వెళ్లి అక్కడి నుంచి మరో రైలులో ధర్మవరం వచ్చాడు. 1వ ప్లాట్‌ఫారం వద్ద తిరుగుతుండగా ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. వారి సమాచారం మేరకు అతడి తల్లి అక్కడికి చేరుకోవడంతో రైల్వే పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుమారుడిని తల్లికి అప్పగించారు.

'మా భూమిని మరొకరికి ఇచ్చారు'..

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

30 ఏళ్ల క్రితం తమకు పట్టా ఇచ్చిన అధికారులు నేడు ఇతరులకు కట్టబెట్టారని సోమవారం ఓ వృద్ధుడు కలెక్టరేట్ ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. అమడగూరు మండలం గుండువారిపల్లికి చెందిన సోమగట్టు నరసింహులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం సర్వే నెంబర్ 414-4లో 4.30 ఎకరాలకు తన భార్య పేరిట 1953లో పట్టా ఇచ్చారన్నారు. ఆమె మృతి తర్వాత తన పేరు మీద పట్టాతో పాటు పాస్ బుక్కులు ఇచ్చారన్నారు. ఇటీవల మామిడాకులపల్లికి చెందిన శంకర్‌రెడ్డి, బాబురెడ్డిల పేరుతో తహశీల్దార్ పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇప్పటికే తహశీల్దార్‌కు, కలెక్టరేట్‌లో 10 సార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని వాపోయాడు. ఈ రోజు కూడా కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చానని తెలిపాడు. ఇకనైనా అధికారులు సమగ్ర విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నాడు.

వికలాంగురాలి స్థలం కబ్జా

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వికలాంగురాలు హరిజన శ్యామలకు ఇచ్చిన స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. 2012లో శ్యామలకు అధికారులు ఇంటి స్థలం మంజూరు చేయగా గ్రామానికి చెందిన రామచంద్రా ఆ స్థలాన్ని ఆక్రమించాడు. ప్రశ్నిస్తే దాడి చేశారని కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు వాపోయారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టరేట్‌లో మూడుసార్లు ఫిర్యాదు చేశామని బాధితులు వాపోయారు.

In the court of the Addl.Junior Civil Judge:Dharmavaram
I.A.No:123/2022 in O.S.No:278/2022

Between:
Tallam Hema Malini ...**Petitioner/Plaintiff**
And
Koppala Siva Parvathi and others
...**Respondants/Defendants**

Notice to Respondant/Defendant No:3

R3:K.Aruna Kumari @ Pujari Aruna Kumari D/o Late K.Narayana Swamy, W/o Pujari Subramanyam R/at D.No:14/358, SBI Colony, PRT Street, Dharmavaram

పై నెంబరు కేసులో పిటీషన్ మరియు దావాలో 3వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 03/11/2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(By order of the court)
D.L.N.MURTHY
Advocate For Petitioner Dharmavaram,
CELL:9000862009.